# హాస్యం హాస్యం

— మహర్షి

చిట్టిబ్బాయ్ కు చటుక్కున మెలకువ వచ్చింది. ఏదో భయంకరమైన శబ్దం అతని చెవులను తాకి అలజడి సృష్టిస్తున్నది. ఎంత ఆలోచించినా అర్థం కాక భార్యను పిలిచాడు.

"వక్కన్నా వక్కన్నా" అన్నది కాంతాలు పళ్ళు బిరబిర మని తోముతు.

"ఖర్మ ఖర్మ. నిన్న ఏదో కొత్త బ్రష్ మార్కెట్ లో కొచ్చినట్టున్నది అనుకుని "ఓసి నీ పళ్ళు తోము దు పాడుకాను. ఆ శబ్దానికి చిన్న పిల్లలు భయపడి ఏడుస్తారు. పుచ్చిపోయిన పళ్ళు ఎంత ఇసకేసి అంట్లు తోమినట్లు తోమినా తెల్ల బడవు పిచ్చి, వెర్రి మొహ మా!" అరిచాడు చిట్టిబ్బాయ్ నిద్రా భంగమై నందుకు చిరాకుపడుతూ.

కాంతాలు విసవిసా రుసరుసలాడుతూ— "మీకత్తా కుయ్యు నా పయ్యుషుషి" అన్నది ఉరిమినట్లు చూస్తూ.

"నోట్లో ఆ బ్రష్ తీసి మాట్లాడులేకపోతే ఇదిదో కొత్త భాష అనుకుని జనం తలబాదుకుంటారు" చిట్టిబ్బాయ్ తను వేసిన జోక్ కు తనే తప్పట్లో దూరి పొర్లిపొర్లి నవ్వాడు.

"నయ్యు అరా అంటాయు కజా మీ పయిచెవు తా" అంటూ రేడియో ఆన్ చేసి వెళ్ళిపోయింది. చిట్టిబ్బాయ్ బేర్ మన్నాడు.

"రాయలసీమ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం రావచ్చు. ఎ.పి. ఎక్స్‌ప్రెస్ రేపు రావచ్చు అనుకుంటున్నారు. మిగతా రైళ్ళ రాకపోకలు చెప్పటానికి ఛిలక జోస్యుడు దొరక్క సిబ్బంది తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడు వార్తలు వింటారు."

"ఆకాష్‌వాణీ! క్షమించాలి. ఆకాశవాణి దూర దర్శన్ కేంద్రం. మళ్ళీ క్షమించాలి. నేను అటు దూర దర్శన్‌లోను ఇటు రేడియోలోనూ వార్తలు చదివి కాస్త తికమక పడ్డాను. మళ్ళీ మళ్ళీ క్షమించాలి. వార్తల కు ముందు వ్యాపార ప్రకటనలు మర్చిపోయాం. కాబట్టి ముందు వ్యాపార ప్రకటనలు వింటారు."

చిట్టిబ్బాయ్ కోపంతో వూగిపోతూ దొరికిన జుట్టు అందుకుని బరబరా పీక్కున్నాడు. కాంతాలు వచ్చి— "అలా జుట్టు పీక్కుని ఇల్లంతా పడేస్తే ఎవడు దుస్తాడు మీ తాత. రేడియో వినలేకపోతే చెవులు మూసుకోండి" అన్నది రుసరుసలాడుతూ.

"దివ్యవాణి! క్షమించాలి. ఆకాశవాణి. వార్తలు చదువుతున్నది అబద్ధాల తికమకరావు. గత నెలలో ఫలానా రాష్ట్రంలో రైలు ఏక్సిడెంట్ కు గురై వెయ్యి మంది మృతికికారకుడైన రైలు ఇంజన్ డ్రైవర్ని నిన్న ఢిల్లీలో ప్లానింగ్ కమీషన్ ఘనంగా సన్మానించింది. ఇలాంటి ప్రమాదాలు వారానికి ఒకటి రెండు చొప్పు న జరిగితే, మన దేశ జనాభా కంట్రోలు అవుతుందని తమ ఆశాభావం వెలిబుచ్చారు. అనేక మంది ప్రము ఖులు వారి ఆశాభావాన్ని బలపరిచారు.

నిన్న పంజాబ్‌లో రాటు తేలిన పదిమంది ఉగ్రవా దులు ఓ పెళ్ళి బృందం మీద దాడి చేయగా, పెళ్ళికి చేసిన అప్పడాలతో పెళ్ళి బృందం ఎదురు దాడి జరు పగా పదిమంది ఉగ్రవాదులు అక్కడికక్కడే మరణిం చారు. చనిపోయిన ఉగ్రవాదుల మృతికి సంతాపం తెలియజేస్తూ చంపిన వాళ్ళందరినీ అరెస్టు చేయవల సిందిగా హోం మినిస్టర్ ఆర్డర్స్ జారీ చేశారు.

## వార్తలు

దేశంలోని రాజకీయ పార్టీలన్నీ కలిసి మరో క్రొత్త పార్టీ స్థాపించి, అధికారం హస్తగతం చేసుకుని వెంటనే విడిపోయి దేశ ఆర్థిక పరిస్థితిని నాశనం చేయటానికి కుట్రలు జరుగుతున్నట్లు ఓ అధికార బోగట్టా.

మనదేశం చేసిన అప్పులు వెంటనే తీర్చకపోయి నట్లయితే ఆంధ్రప్రదేశ్ ని తమకు స్వాధీనం చేయ వలసిందిగా వరల్డ్ బ్యాంకు డిమాండ్ చేసింది. అం దుకు మనదేశం సుముఖంగా వున్నట్లు కొన్ని వార్తలు అందుతున్నాయి.

మన దేశంలోని అక్రమ వ్యాపారులు, ప్రజాధనా న్ని దోచుకున్న రాజకీయ నాయకులు స్విస్ బ్యాంకు లో దాచుకున్న డబ్బుని తిరిగి మనదేశానికి అప్పులివ్వ టానికి ముందుకొస్తున్నారు.

నిన్న ఉదయం అమెరికా అధ్యక్షుడు జార్జిబుష్, ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ కలిసినప్పుడు విందులో మందు తీసుకుంటుండగా ఇద్దరూ కళ్ళు తిరిగి పడిపోయారు. వెంటనే తీసుకొచ్చి హైదరా బాద్ ఉస్మానియా హాస్పిటల్ జనరల్ వార్డులో చేర్పించారు.

ఆకాష్‌వాణి దూరదర్శన్ కేంద్రం. మళ్ళీ క్షమిం చాలి. ఛీ...ఛీ... మీరు మాత్రం ఎన్నిసార్లు క్షమిస్తారు. కనుక వదిలేద్దాం. ఆకాశవాణి బెడవారు కేంద్రం. మీరు వార్తల్నే వింటున్నారు.

నిన్నరాత్రి పాత నగరంలో మత కలహాలు సృష్టిం చబోయిన రాజకీయ నాయకుల్ని హిందువులు, ముస్లింలు కలసి దేహశుద్ధి చేసి మూసీ నదిలో పడే శారు.

ఇప్పుడే అందిన వార్త. నీళ్ళతో నడిచే కారుని తయారు... బర్... బర్... గుర్... గుర్...కిర్... కిర్... తెలిసింది" ఇంకా వార్తలు వస్తూనే వున్నాయి.

"కాంతాలూ!" ఆనందంగా అరిచాడు చిట్టిబ్బా య్. "మీ వాకుల్లో మేకులు కొట్టా. ఎందుకలా అరు స్తున్నారు. చుట్టు ప్రక్కల వాళ్ళు భయపడి చస్తున్నా రట. "కసకసలాడింది కాంతాలు వచ్చి. చిట్టిబ్బాయ్ మంచం మీద నుండి గెంతి భార్యను వాటేసుకుని గిరగిరా తిప్పాడు.


"యాక్ ఛీ...ఛీ... మీ నోటి కంపుపాడు కాను. మీ ఒంటి మీద లుంగీకూడా లేదు" అంటూ ముఖం తిప్పుకుని వంకర్లు తిరిగిపోయింది కాంతాలు.

"వెధవ లుంగీ తరువాత చూసుకుందాం ముం దు నేనే చెప్పేది విను" తొందరపెట్టాడు.

"ముందు మీరు లుంగీ కట్టుకోండి పిల్లలు చూస్తే జడుసుకుంటారు."

"అయ్యయ్యో. నా లుంగీ లేదా?" అంటూ గబగబా లుంగీ అందుకుని చట్టుకుని కట్టుకుని— "మనం కారు కొంటున్నామోచ్" చెప్పాడు.

"ఎవరైనా లక్ష రూపాయలు లంచ మిస్తాన న్నారా?" గబగబా పొంగి పోతూ అడిగింది కాంతాలు.



"నీ మొగుడేమన్నా ఇంజనీర్ అనుకున్నావా లక్ష రూపాయల లంచమివ్వటానికి?" పళ్ళు పటపటలాడించాడు.

"మరెలా కొంటున్నారు?" ఒళ్ళంతా ఊపుకుంటూ బ్రతిమాలింది కాంతాలు.

"కొంటున్నానంతే!" మరింకేం మాట్లాడకు.

"కొంటేకొన్నారు కానీ ముందు కాస్త పళ్ళు తోముకోండి వాసన భరించలేకపోతున్నాను"

"అలాగే కానీ అర్జంటుగా ఎదురింటి ఎల్లారావు గారి పేపర్ వాళ్ళావిడను అడిగి తీసుకురావాయ్"

"ఎందుకు? ఇప్పుడేగా రేడియోలో వార్తలు విన్నారు. నేను మొన్నామధ్య చారులో చింతపండు అడిగితే ఇవ్వనన్నాను. మీరే తెచ్చుకోండి" అన్నది కాంతాలు గారాలు పోతూ.

చిట్టిబ్బాయ్ గబగబా మొహం కడుక్కుని, చకచకా తల దువ్వుకుని, టకటకా నడచివెళ్ళి రెండు సెకన్లలో పేపర్ తెచ్చుకున్నాడు.

కాంతాలు కాఫీ తీసుకొచ్చింది. "ఇవాళ సెలవే కదా! మరీ అంత కంగారుదేనికి?" కాఫీ అందించింది.

"పేపర్లో కారు కనిపించడం లేదు."

"పేపర్లో కార్లుంటాయా ఏమిటి? అన్నది కాంతలు బుగ్గలు నొక్కుకుంటూ.

కారు గురించిన వార్త. అయినా పేపరు నిండా రేడియోలో చదివిన వార్తలే వున్నాయి.

మూడుసార్లు గిరగిరా త్రిప్పి చివరికి ఓ మూలన బాక్స్ అయిటమ్‌ను చూసి "దొరికింది— దొరికింది" పెద్దగా అరిచాడు.

"మీ ఇంట్లో దొంగలు పడిదోచుకు పోయారా ఏమిటి? దొరికింది దొరికింది అంటున్నారు" బయట నుండి భిక్షగాడు అడిగాడు పెద్ద గొంతుతో.

"నువ్వు అర్జంటుగా మా ఇంటి ముందు నుండి వెళ్ళకపోతే నీ ఒంట్లోని పార్టులు దొరకవు మరి" పెద్దగా కేకలేశాడు చిట్టిబ్బాయ్.

చిట్టిబ్బాయ్ కళ్ళు వార్త వెంట పరుగిడుతున్నాయి. "మీకు మంచిరోజులు వచ్చాయి. నీటితో నడిచే కారు తయారు చేస్తున్నారని వార్త తెలిసింది. ఆ వార్త తెలుసుకొని మా విలేఖరి బద్ధకాల బద్ధకేశ్వరిని పంపగా ఆమె బద్ధకించి వార్తను కలెక్ట్ చేయలేకపోయింది. దయచేసి మరో పేపర్లో ఈ వార్త చదువుకోగలరు— ఎడిటర్."

"ఛీ... ఛీ... ఛీ... అవసరమైన వార్త ఒక్కటి దొరికి చావదు. చిన్నప్పటి నుండి ఇంత దిక్కుమాలిన జాతకం. హు. ఈ పేపరు వాళ్ళ మొహాన కొట్టి, నేను బజారుకెళతాను. సంచీ నా మొహాన పడేయ్!" అరిచాడు చిట్టిబ్బాయ్ డ్రస్ వేసుకుంటూ.

"నిన్న టి.వి.లో చూశానండీ, మార్కెట్‌లోకి క్రొత్తగా బ్రష్ వచ్చిందట. ఓ నాలుగు బ్రష్‌లు తీసుకురండి" చెప్పింది కాంతాలు.

"నీ పళ్ళు నాశనం కాను. పుచ్చిపోయిన పళ్ళు తెల్లబడవే అంటే వినవే! డబ్బంతా నీ బ్రష్‌లకే సరిపోతున్నది. ఖర్మ... ఖర్మ..." విసుక్కున్నాడు.

"సర్లెండి... పళ్ళు మంచిగా వున్న వాళ్ళకేం తెలుసు పళ్ళ గురించి. ఆ చెప్పడం మరిచాను. వచ్చేటప్పుడు రెండు కిలోల స్వీటు తీసుకురండి."

"స్వీట్ దేనికి?"

"ఎందుకేమిటి? మీరు కారుకొంటున్నారని ఒట్టిగా చెబితే ఏం బాగుంటుంది. కాస్త స్వీటు పెట్టి చెబుతాను. త్వరగా వచ్చెయ్యండి. ఈ విషయం అందరికీ చెప్పకపోతే నా కడుపు వుబ్బుతుంది"

"అలాగే..." అంటూ చిట్టిబ్బాయ్ బయటకెళ్ళాడు.

ఎంత ప్రయత్నించినా కారుతో నడిచే నీరు... ఛీ...ఛీ...ఛీ... నీటితో నడిచేకారు గురించిన సమాచారం చిట్టిబ్బాయ్ కు అందలేదు. సాయంత్రం టి.వి. వార్తల్లో తెలుస్తుందేమోనని ఆశగా ఎదురుచూశాడు. వార్తల సమయానికి వాల్యుమ్ పెంచి ఎదురుగా వాలు కుర్చీ వేసుకుని చూస్తున్నాడు. వార్తలు మొదలయ్యాయి.

"ఆకాశవాణీ దూరదర్శన్ కేంద్రం. మన్నించాలి. ఇది టీ.వి. కదూ! మర్చిపోయాను. ఇక్కడ అలా చదవకూడదు కదా!"

"అందుకే టీ.వి. వార్తలు చదవటానికి రేడియో వాళ్ళను పిలవ వద్దంటే విన్నారా? రికమెండేషన్ రికమెండేషన్ అంటూ తీసుకొచ్చి అభాసుపాలు చేస్తున్నారు. అనుభవించండి" వెనక నుండి మాటలు వినబడుతున్నాయి.

'ఈ రోజు వార్తల్లోని మార్పును మీరు గమనించాలి. మన రాష్ట్రంలో నిరక్షరాస్యులు రోజు రోజుకు పెరిగిపోతున్నారు. ఇలా వార్తలు చెబుతుంటే వినే వారి సంఖ్య ఎక్కువై, చదవటానికి ప్రజలు బద్ధకించి చదువు మరచిపోతున్నారు. కనుక ఈ రోజు నుండి మేము వార్తలు చదవడం లేదు. చూపిస్తున్నాము. కాబట్టి చెవులకు పనితగ్గించి, కళ్ళకుపని కల్పించండి' అంటూ టీ.వి. స్క్రీన్ మీదకు అక్షరాలను పోకస్ చేశారు. అవి అర్థం కావడం లేదు. గజిబిజిగా గందరగోళం. ఒక్కోముక్క అర్థం చేసుకోవడానికి రెండు నిముషాలు పడుతున్నది.

చిట్టిబ్బాయ్ ఆతృతగా చదవబోయి, చిరాకు పుట్టి చూస్తు వూరుకున్నాడు.

"మీరు వార్తలు చదువుకున్నారు. ఈ వార్తలు ఇంతటితో సమాప్తం. రేపు ఇదే సమయంలో ఇదే మీటరు మీద కలుసుకుందాం— సెలవు."

చిట్టిబ్బాయ్ కు విపరీతమైన కోపం వచ్చింది. చిరాకుగా జుట్టు అందుకుని బరబరా పీక్కున్నాడు. కాంతాలు కయ్ మని లేచింది. "వార్తలు చూడలేకపోతే టి.వి. బంద్ చేయండి. అంతేకాని ఇలా జుట్టంతా పీక్కుంటుంటే ఊడ్చలేక నేను ఛస్తున్నాను. అలా పీక్కుని పీక్కుని నెత్తిన జుట్టు మొత్తం వూడిపోతే అద్దంలో చూసుకుని జడుసుకుంటారు. నేను మిమ్మల్ని వదిలి ఎంచక్కా పుట్టింటికి పోతాను. అప్పుడు మీ రోగం కుదురుతుంది" విస్సుక్కున్నది.

కాంతాలు భర్తని ఉదయాన్నే నిద్రలేపి హడావిడి చేసి, హంగామా చేసి దగ్గరుండి మరీ టిఫిన్, తినిపించి, తయారు చేయించి భర్తను ఆఫీసుకు సాగనంపుతూ చెప్పింది.

"ఏవండీ! పక్కింటి పిన్నిగారిని తీసుకుని షోరూంకి వెళ్తాను.మీదసలే మట్టిబుర్ర. ఏ కారు తీసుకోవాలో బొత్తిగా తెలియదు. నేను కారు రంగు, మోడల్ సెలక్ట్ చేసుకుంటాను. ఏవంటారు?"

"అలాగే అలాగే రేపు అడ్వాన్స్ ఇచ్చి కారు తెచ్చుకుందాం" అన్నాడు చిట్టిబ్బాయ్.

ఆనందంగా ముందుగా కొనుక్కుంటే రేటు తక్కువగా వస్తుందని అతని ఆలోచన.

ఆఫీసులో అడుగు పెట్టిన చిట్టిబ్బాయ్ ని అందరూ గౌరవంగా ఆహ్వానించారు. చిట్టిబ్బాయ్ కు చాలాఆశ్చర్యం అనిపించింది. కారు కొనుక్కుంటే ఎంతటి గౌరవం అనుకున్నాడు.

ఆఫీస్ అటెండర్ నమస్కారం కొట్టి "సార్! మీరు కారు కొంటున్నారని అందరికీ తెలిసిపోయింది కనుక ముందుగానే స్వీట్ తెస్తాను డబ్బులివ్వండి" అన్నాడు. చిట్టిబ్బాయ్ ఆనందపడుతూ ఓ వంద తీసి అందించి, 'చిల్లర వుంచుకో' అని ఇదొక రకమైన డిగ్నిటీ అనుకున్నాడు.

ఆఫీసులోని వాళ్ళంతా చిట్టిబ్బాయ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. అందరికీ స్వీట్లు పంచాడు చిట్టిబ్బాయ్. అతనికి అర్థంకాని ప్రశ్న ఒక్కటే, తనకంటే ముందుగా ఈ వార్త ఆఫీసుకు ఎలా చేరింది అని. అదే అడిగాడు వారిని. వాళ్ళు ఫెళ్ళున నవ్వి— "మీ శ్రీమతిగారు పట్నంలో సగం మందికి ఈ వార్త అందించగా లేనిది మాకు చేరటంలో ఆశ్చర్యం ఏమున్నది" అన్నారు ఏక కంఠంతో అమ్మో, అమ్మో అనుకున్నాడు చిట్టిబ్బాయ్.

చిట్టిబ్బాయ్ అందరు వత్తిడి తెచ్చిన మీదట తాను కారుకొనే ఆలోచన ఎలా వచ్చింది, ఎలాంటి కారు కొనాలనుకుంటున్నదీ అందరికీ వివరించాడు. అంతే అందరూ ఫెళ్ళున నవ్వి, నవ్వి, పొట్టలు చేత్తో పట్టుకుని కుర్చీల్లో కూలబడి కాళ్ళు చేతులు బాదుకుని మరీ నవ్వారు. అటెండరు నవ్వుకు తట్టుకోలేక క్రిందపడి కాళ్ళు చేతులు బాదుకుంటున్నాడు.

"అయ్యో చిట్టిబ్బాయ్! నిన్న ఏప్రియల్ ఫస్ట్ కదా! అందుకే మిమ్మల్ని ఏప్రియల్ ఫూల్ చేశారు. అంతేకానీ నీటితో నడిచే కారుని తయారు చేయబడ లేదు" మేనేజరు బానలాంటి పొట్టను వూపుకుంటూ వివరించారు. అంతే! చిట్టిబ్బాయ్ మొహంలో ప్రేతకళ వచ్చింది.

■■